
మ్యాజెర్సీ కథల పోటీలో 150 రూపాయిలు బహుమతిగా అందుకున్న కథ

# అది గృహం

— ఉపద్రష్ట కృష్ణప్రియ



"ప్రియమైన అన్నయ్యకి —

నమస్కారాలు. నాన్నగారు వృద్ధాప్యంలో మనని విరాకరించి ఆ వూళ్ళో పడి వుండడం ఏమీ బాగుండలేదు. బుద్ధులు చెపుతూ పంతులుగారు, పాలేరు వీరయ్యా ఉత్తరాలు వ్రాస్తున్నారు. ఎంత చెడ్డ పేరు! ఎంత అప్రతిష్ఠ! ఉండడానికి యిల్లు వుండడం వల్ల కదా ఆయన మన మాట వినకపోవడానికి కారణము. అది అమ్మివేస్తేగానీ కదిలిరారు. పెద్దగా ధర రాదుగానీ, కొద్దిగా వచ్చినా పిత్రార్జితం కదా గుర్తుగా ఏదైనా కొనుక్కుందాము. ఆయనకి నచ్చ చెప్పి ఏదైనా ఏర్పాటు చేయవలసినది. మన యిద్దరి దగ్గరా ఎక్కడైనా హాయిగా తన జీవిత చరమ భాగాన్ని ఆయన గడపగలరు.

- సీతారాముడు

ఆ వుత్తరం చదవడం నాలుగోసారి. మడిచి జేబులో పెట్టుకున్నాను. సీతారాముడు చెప్పింది నిజమేనని పిస్తోంది. అమ్మ పోయి నాలుగేళ్ళయింది. అయినా ఆయన అక్కడే కాలక్షేపం చేస్తుంటే, గత ఏడాది తద్దినానికి వెళ్ళినప్పుడు తామిద్దరూ తమతో రావలసి నదిగా బ్రతిమలాడారు. సీతారాముడు నిరాహార దీక్ష మొదలుపెడతానని బెదిరిస్తే బలవంతాన కదిలి వెళ్ళారు ఆయన.

సీతారాముడి భార్యకి సికింద్రాబాదు దగ్గర ఓ పల్లెలో ఉద్యోగం. వీడికి సికింద్రాబాదులో బేంకు ఉద్యోగం. పిల్లలు స్కూళ్ళ కెళ్ళిపోయే వయసువాళ్ళు. అంతా బిజీ వారే. నెల రోజులనాడే "నాన్నగారు బోర్ పోతున్నారు. మాకు మరీ రెండు గదులేకదా. ఇరుకు ఫీలవుతున్నారు. నీ దగ్గరికి పంపుతున్నాను. ఆయన సుఖంగా వుండడమే కదా మనకి కావలసినది" అంటూ కార్డు రాసి పడేశాడు. మర్నాడే నాన్నగారు రైల్లో దిగబడిపోయారు. నాకు తెలి యదూ - సీతారాముడు డబ్బు మనిషి. వాళ్ళావిడ చిక్కి చిక్కి మరీ దాస్తుందిట. ఎక్కడో అపార్టుమెంటు కొనుక్కుంటున్నారుట. ఇద్దరి జీతాలూ దాచేస్తున్నారు. ఇంట్లో లేని వస్తువు లేదు. వాడు ఆయన్ని వుంచు కుంటాడని నేను అనుకోలేదసలు. ఇక నాన్నగారు నా దగ్గరే మరి. ఏం చేస్తాను. తప్పదు కదా! నాకు కాలేజీలో పంతులుద్యోగం. పిల్లలు ముగ్గురు. మా ఆవిడ బాగా ఆస్తితో వచ్చిందిలెండి. మరి ఆవిడ హోదాకి తగ్గట్టు వుంటుంది మా యిల్లు. మరి ఆవిడ పెత్తనమేలెండి. ఆవిడకి డబ్బు యివ్వడం వరకే నా డ్యూటీ. కాలేజీ కాంగానే అలా క్లబ్బుకి వెళ్ళడం, రాత్రి పదింటికి యిల్లు చేరడం, మా ఆవిడ పడేసే మెతుకులు కతికి మంచంపై వాలడం - యిదీ నా దినచర్య.

మా యింట్లో ఎవరికి వారికి స్పెషల్‌గా గదులు న్నాయి లెండి. నాన్నగార్కి స్టోరు గది ఖాళీ చేయిం చింది మా యింటావిడ. రోజులు బాగానే గడుస్తు న్నాయి. రాగా రాగా ఏవేవో ప్రాబ్లమ్స్ చిన్నవే లెండి, నా దృష్టిలోకి రాసాగాయి.

నాన్నగారు పొద్దున్న నాలుగ్గంటలకి లేచి రామనామ సంకీర్తన మెల్లగా మొదలుపెట్టేవారు. మా ఆవిడకి అప్పుడే కాస్త నిద్ర ఎక్కువగా పడుతుందిట. వినుక్కు నేది.

మనమూ ఆలోచించాలి కదా మరి!

ఆయనకి మెత్తగా అన్నం కావాలి. మా యింట్లో బియ్యంలా వుంటేగానీ ఎవరూ తినరు. వేరేగా అన్నం వండడానికి వంటావిడ ఓ యాభై ఎక్కువ అడిగింది. కష్టమే కదా! నాన్నగారు సర్దుకుంటే బాగుంటుంది అనిపించింది నాకు.

టి.వి.లో హరికథలు, పురాణాల్లాటివి ఆయన సరదా పడేవారు. అలాటివి మా ఆవిడకి పల్లెటూరి నాటంగా కనిపిస్తాయి. అసలు పెట్టుకోదు. విన్నా నిసిగిపోతుంది ఎక్కడైనా. రాత్రి పదయ్యాక మెల్లిగా పెట్టుకునే వారాయన. ఆవిడకి నిద్రపట్టడం మొదలయ్యే గంట కదా అది. మరెలా!

అప్పుడప్పుడూమా ఆవిడ లేడీస్ క్లబ్బు ఫ్రెండ్స్‌కి పార్టీ యిస్తుంటుంది. ఓసారి ఓ ఆవిడ పచ్చిమిరపకాయ కొరికి శివతాండం ప్రారంభించిందిట. నాన్నగారు పంచదార పట్టుకొని యిచ్చారుట. ఆవిడ "మీ కుక్‌కి సమయస్ఫూర్తి ఎక్కువేనే" అందిట.

మా ఆవిడ ఆ రాత్రే ఆయన్ని దులిపేసింది - "నలు గుర్లోకి పంచకట్టుతో రాకూడదని తెలియదా?" అని.

'నిజమే కదా. పెద్దాయన అర్థం చేసుకోవద్దూ' అనిపించింది నాకు.

తెల్లారేటప్పటికల్లా స్టోర్ రూం ఖాళీగా వుంది! తన పల్లె వెడుతున్నట్లు ఓ కాగితం.

ఓ రకంగా బాగానే వుందనిపించింది. కానీ వూళ్ళో నేధవలకే బాధ ఎక్కువైపోయింది.

"పెద్దాయన్ని కనిపెట్టి చూస్కోండి బాబూ అనో, పిల్లల్ని కన్నా, వాళ్ళు పెద్ద వయసులో ఆధారం అవు తారా?" అనో నిసుర్లు.

సీతారాముడు చెప్పినట్టుగా యిల్లమ్మితే గానీ సుఖం లేదు. వెంటనే నాన్నగారి దగ్గరకు బయల్దేరాను. అసలు సంగతి ఎలా ఎత్తాలో ఆయన్ని చూశాక బోధపడలేదు. ఆయన పెట్టిన అన్నం తిని భోషాణం పెట్టె మీద వాలాను. పైరగాలి రివ్వున వచ్చి నాకు జోల పాడింది.

మెలకువ వచ్చేటప్పటికి నాన్నగారు ఎవరితోనో మాట్లాడుతున్నారు. బయటికి వచ్చాను. సపోటా చెట్టు క్రింద చప్టా మీద కూర్చున్నారాయన. కొబ్బరి చెట్ల మొదట్లో వీరయ్య కూర్చున్నాడు. మందార, గన్నేరు, నందివర్ధనం, గరుడవర్ధనం, నాగమల్లి చెట్లు యింటి నిండా వున్నాయి. అవి రకరకాల రంగుల్లో పూలు పూస్తూ, ఆ వాతావరణం నామటుక్కి నాకే ఎంతో అందంగా, ఆహ్లాదంగా కనిపించసాగింది. మాది పెద్ద పెరడూ, వాకిలీ వున్న యిల్లు లెండి, ఇల్లు పూరిల్లు అయినా. నాన్నగారి గొంతు నెమ్మదిగా వినిపిస్తోంది-

"వీరిగా! జీవితం ఒక పూర్తి రోజులాటిది. వృద్ధాప్యం సాయంకాలం లాటిది. ఆహ్లాదంగా నాలుకుర్చీలో కూర్చుని ఒక పుస్తకం చదివినట్టుగా, జీవితంలోని ప్రతి సంఘటననీ నెమరువేసుకోవలసిన వయసిది. పార్వతీ, నేనూ నలభై యేళ్ళు కలిసి జీవితాన్ని పంచుకున్నాం. ఈ పరిసరాల్లో ఎక్కడో తాను వున్నట్లే అనిపిస్తుంది నాకు. ఈ చెట్టూ, చేమా, ఈ వాకిలీ గడపా, దేవుడి గదీ అన్నీ సజీవ చిత్రాలు నా దృష్టిలో. నాకిది స్వర్గంతో సమానం. పిల్లలు అభిమానంగా నన్ను రమ్మంటారు గానీ, నేనే పోలేనురా" అని ఆయన అంటూంటే నా కళ్ళు మసకలు బారాయి. మమ్మల్ని నెలితి పెట్టకుండా ఆయన వీరయ్యతో మాట్లాడిన తీరు నా గుండెని పిండి నట్లయింది. నాలో ఎక్కడో మనిషి కదిలినట్లయింది. వెంటనే యింటికి బయలుదేరాను. మర్నాడే సీతారాము డికి కార్డు రాసిపడేశాను.

"తమ్ముడూ

మనవన్నీ కొంపలు. నాన్నగారు వుంటున్నది యిల్లు. దాన్ని మరమ్మత్తు చేయిద్దామనుకుంటున్నాను. ఓ మనిషిని ఆయన సేవకి పెడదామనుకుంటున్నాను" అని.

●